కథ

# యుద్ధనాదం

పెద్దింటి అశోక్‌కుమార్

**గంట మోగింది. అలవాటుగా పిల్లలందరు బయటకు పరుగెత్తుకువచ్చారు.**

**"లైన్ గట్టుండ్రి... తొందరగా" బయటి నుంచి వచ్చిన వ్యక్తులు అన్నారు.**

**ఇద్దరిద్దరు పిల్లలు జోటలు కట్టి లైను గట్టారు. అరుపులు నినాదాలు.**

క్లాస్ రూంలోంచి బయటకు వస్తూ సెల్ ఫోన్ చూసుకున్నాను. పదకొండు మిస్‌డ్ కాల్స్. సైలెన్స్ మోడ్‌లో ఉండి గుర్తుపట్ట లేదు. ఓపెన్ చేసి చూస్తే ఇంటినుంచే. పాణం జల్లుమంది. వెంటనే ఫోన్ చేసాను. స్వప్న ఎత్తింది. నా ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నట్లు ఒక్క రింగుకే!

'పవన్ ఇంకా ఇంటికి రాలేదండి' స్వప్న కంఠం వణుకుతుంది.

నేను ఆదరబాదరగా స్కూల్‌కు రెడీ అవుతుంటే పవన్ లేడన్న విషయం స్వప్న చెప్పినట్టు నాకిప్పుడు గుర్తుకొచ్చింది. ఆ తొందరలో నేనేం పట్టించుకోలేదు. మళ్లీ తను చెప్పలేదు. ఇప్పుడు ఇంత కంగారుగా చెబుతుంటే భయం వేసింది.

పైకి మాత్రం గంభీరంగా 'వత్తడులే... చిన్న పిల్లగాడా... ఫోన్ చెయ్యి' అన్నాను.

'సెల్ ఇంట్లనే ఉందండి. నాకు భయంగా ఉంది' స్వప్న ఏడుపురాగంతో అన్నది మళ్లీ.

నాకు వణుకు పుట్టింది. పవన్ నిద్ర, తిండి, కట్టుకునే బట్టలైనా మరిచిపోతాడేమో కానీ సెల్ మరిచిపోడని నాకు తెలుసు. పంచేంద్రియాల్లా సెల్ కూడా వాడి శరీరంలో ఒక భాగమయింది.

"ఆ... వత్తడులే స్వప్నా... భయమెందుకు... నేనస్తున్నానుండు..." అంటూ టైం చూసుకున్నాను. పదకొండు దాటింది.

పర్మీషన్ కోసం హెడ్‌మాస్టర్ గదిలోకి వెళ్లాను. స్టాఫ్‌లో చర్చ జరుగుతుంది. "బంద్‌లు ఎందుకన్నా...బంద్‌లు... పిల్లలు చదువుకోవద్దా...! ఆవులావులు కొట్లాడుకొని ల్యాగల కాళ్లు ఇరుగ్గొట్టినట్టుంది..." తెలుగు టీచర్ అంటున్నాడు.

"ఉద్యమమంటే యుద్ధమే. అందరు చేయాలె. ఒకటి సాధించాలంటే ఇంకోదాన్ని వదిలిపెట్టాలె..." సోషల్ టీచర్ వాదన.

"వాళ్ళలెక్క వీళ్లు రాజీనామా జేత్తె అయిపోతుండె గదా... నోటికాడి బుక్కను ఎత్తగొట్టిరి" హింది మేడమ్ అంటుంది.

నన్ను చూసి "అన్నా... పవన్ కేసు ఎక్కడిదాకచ్చింది" అన్నాడు సోషల్ టీచర్.

"ఎక్కడికెంది...కోర్టుకు నడవాలె. ఒకటా, రెండా... పద్నాలుగు కేసులు వెట్టిండ్రు" అంటూ హెడ్మాస్టర్ వద్ద పర్మీషన్ తీసుకుని బయటకు వచ్చాను.

లోకల్ స్కూల్ అయినా నేనుండే శివనగర్‌కు అంబేద్కర్ నగర్‌కు రెండు కిలోమీటర్ల పైననే. కమాన్ వరకు నడిచివచ్చి ఆటోలో ఎక్కి కూర్చున్నాను. రకరకాల ఆలోచనలు. పవన్ ఏమయ్యాడు ఎక్కడికెళ్లాడని.

ఆటో రెడ్డిగల్లి దాటిందో లేదో పెద్ద ఊరేగింపు ఎదురొచ్చింది. ఎన్నడూ చూడని జనం. ఏదో ఉన్మాదంలో ఉన్నట్టుగా ఊగిపోతున్నారు. ముందు డప్పుల చప్పుడు. వెనుక నలుగురు యువకులు. పంది పిల్లలను ఎత్తుకుని 'జైర తెలంగాణ... జైజైర తెలంగాణ' అంటూ ఎగురుతున్నారు. వెంట వారి కుటుంబాలు.

నెల రోజులుగా ఊరేగింపులు, ధర్నాలు, రస్తారోకోలు, బంద్‌లు. ఊరు ఊరంతా అట్టుడుకుతుంది. ఆటోలో ఉండగానే రెండు సార్లు ఫోన్ మోగింది. స్వప్న దగ్గరినుంచే. ఎత్తలేదు. డ్రైవర్‌ను మాత్రం తొందర పెట్టాను. మేన్‌రోడు నుంచి కాకుండా సందులు సందులు తిరుగుతూ ఇల్లు చేరేసరికి పది నిమిషాలు దాటింది.

స్వప్న నా కొరకే ఎదురుచూస్తున్నట్టుంది. గేటు వద్ద నిలబడింది. ఎదురొచ్చి ఏడ్చినంత పనిచేసింది. లోలోపల నాకు ఏడుపొస్తున్నా బలవంతంగా దిగమింగుకుంటూ 'అరే యాడికిపోడు... వత్తడు తియ్యి' అన్నాను. నా మాటలు నాకు కూడా వినిపించనంత మెల్లగా ఉన్నాయి.

ఆమె వెక్కుతూనే పవన్ సెల్ తెచ్చి ఇచ్చింది. మెసేజ్ స్క్రీన్ మీదే ఉంది. మూడే మూడు లైన్లు.

నౌ ఆర్ నెవర్ - డూ ఆర్ డై
తెగిస్తే తప్ప తెలంగాణ రాదు.

అటువంటి వాక్యాలను నా సెల్‌లో చాలా సార్లు చూసాను. మొదటిసారి చూసినప్పుడు కొంత ఉల్కిపడ్డా తర్వాత మామూలయి



పోయింది. మెసేజ్ బాక్స్‌లు తెరిచి చూస్తే పవన్ అంతరంగాన్ని చదివినట్టుగా ఉద్వే గాన్ని పెంచే మెసేజ్‌లు.

"దీనికే ఏడుతున్నవా... ఇసొంటియి రోజుకు పది వస్తయి. ఏముందిండ్ల" అంటూ స్వప్న వైపు చూసాను.

స్వప్న కళ్ల వెంట ధారాపాతంగా నీళ్లు. "వాడు రాత్రి నుంచి ఏదో వదురుతుండు. అన్నం కూడా తినలేదు" అన్నది.

'పొద్దున ఎప్పుడు పోయిండు చూసిన వా...?' అడిగాను.

'మీరు మార్నింగ్ వాక్‌కు పోయినప్పుడు. ఆగమాగాన బయటకు పోతుంటే ఎక్కడికిరా అన్న. చెప్పకుండా ఆగమాగాన పోయిండు" ఏడుపును ఆపుకుంటూ చెప్పింది.

నాకు కోపం వచ్చింది. 'అప్పుడు పోతే... ఇప్పుడా చెప్పేది... ఏంది స్వప్నా ఇది...' అన్నాను. నా మాటల్లో మందలింపుకంటే నిస్సహాయతనే ఎక్కువగా కనిపించింది.

'వెంటనే వత్తడనుకున్న... ఈ మధ్య బయటకు వెళ్లినా వెంటనే తిరిగి వత్తుండు' అన్నది స్వప్న.

"పొద్దంతా ఎట్లుంటుండు" అడిగిన.

"ఎట్లుండుడేంది... పిల్లి వచ్చిన కోడిలెక్క నే... ఎప్పుడు టీవీ ముందే. నిన్న రాజీనా మాలు వెన్కకు తీసుకున్నరని వార్త రాంగనే ఆగమయిండు" చెప్పింది స్వప్న.

నాకు కోపమొచ్చింది. "వాడు చూస్తున్నది సినిమా గాదు. సీరియల్ గాదు. రేటింగ్‌లో పోటీ వడి గోరంతలు కొండంతలు జేసి చూపే న్యూస్ చానల్స్ వద్దని చెప్పద్దా" అన్న స్వప్న నన్ను ఆందోళనగా చూసింది.

ఇంకేదో దాస్తున్నట్టుగా అనిపించి తరిచి తరిచి అడిగితే వంటింట్లో కిరోసిన్ బాటిల్ లేదని చెప్పి పక్కన పగిలింది. నా వెన్నులో పుట్టిన వణుకు మెదడుకు చేరింది. నిల దొక్కుకుని నిలబడలేక సోఫాలో కూలబడి పోయాను.

ఒక తరంలో పోరాటానికి పరాకాష్ట ప్రాణం ఇవ్వడమే అయితే ఈ తరానికి ప్రాణం తీసుకోవడంగా ఎందుకు మారింది? ఆ చైతన్య ధార మనిషిలో ఎక్కడ తెగిపో తుంది? ఆవేశం పరిణితిగా అవగాహనగా మారకుండా ఎందుకు ఉద్వేగాన్ని ఉద్రేకాన్ని పెంచుతుంది? పోరాటంలో నిలువలేక బయటకు రాలేక అతి తేలికగా పలాయన వాదాన్ని ఎందుకు ఆశ్రయిస్తున్నారు? విముక్తి కోసం జరిగే పోరాటాన్ని విజయం కోసం చేసే యుద్ధంలా ఎందుకు చూస్తు న్నారు? ఈ మధ్య నన్ను రోజు వేధిస్తున్న ప్రశ్నలు ఇవి. అన్ని ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టాయి.

'స్వప్నా... వాడు చిన్నపిల్లగాడా...? బి.టెక్. చదువుతున్నడు. వాడేం పిరికోడు కాదు...' ఓదారుస్తున్నట్టుగా అన్నాను. నాలో కూడా దుఃఖం. ఓదార్చాలని ప్రయ త్నిస్తూ ఓడిపోతున్నాను.


కొద్దిసేపటికి స్వప్న తేరుకుంది. పవన్‌కు ఎవరెవరు ఫ్రెండ్స్ ఉన్నారో గుర్తు చేసుకు న్నాను. నాకు తెలిసి ఒకరిద్దరు తప్ప వాడికి ఫ్రెండ్స్ లేరు.

వారం రోజుల కింద అనుకుంటాను. రాత్రి పన్నెండు గంటలకు నన్ను నిద్ర లేపి కూర్చోబెట్టాడు పవన్. హెచ్చెమ్ టీవీలో దశ దిశ ప్రోగ్రాం నడుస్తుంది. లైవ్ చూస్తే వైజాగ్. అప్‌డేట్‌లో కత్తుల్లాంటి మాటలు.

"నాన్నా... వాళ్లు చూసారా... తెలంగాణ లో ఉద్యమమే లేదంటుండ్రు. ప్రజలు తెలంగాణను కోరుకుంటలేరట. చావులన్నీ వ్యక్తిగత కారణాలతోనేనట. తెలంగాణ వస్తే నక్సలైట్ల రాజ్యమైతదట" అన్నాడు.

'వాడేదో అంటే వీడేదో కొంపలు అంటుకు పోయినట్టు అర్ధరాత్రిపూట నన్ను నిద్రలేపి చెప్పాలా' అని కోపం వచ్చింది. అదే కోపం తో వాడివైపు చూసాను. మరుక్షణం నా కోపం భయంగా మారింది.

పవన్ చాలా ఉద్వేగంగా అంతకుమించి ఉద్రేకంగా ఉన్నాడు. పిల్లల్ని ఎత్తుకపోవడా నికి వచ్చిన పిల్లి మీదికి తెగారంతో దాడికి దిగిన తల్లికోడిలా నిలువెల్లా విచ్చుకుని ఉన్నాడు. పోలీసు రిమాండ్‌లో మొదటి సారిగా వీన్ని అదే స్థితిలో చూసాను.



"వాళ్లేదో అంటరు. దానికే ఇంత ఆవేశ పడుతరా... ఎవల వాదన వాళ్లది" అంటూ చిన్నగా మందలించాను.

పవన్ నా మాట వినడం లేదు. లక్షల మందిని ఉద్దేశించి ప్రసంగం చేస్తున్న ఉద్య మకారుడిలా టీవీని చూస్తూ ఆవేశంగా ఏదో అంటున్నాడు. పాకిస్తాన్ గెలిచిందనో ఇండి యా ఓడిందనో టీవీలను బద్దలు కొట్టే ఆవే శం కాదది. అస్తిత్వం కోల్పోతున్నప్పుడు, ఆత్మగౌరవం దెబ్బ తింటున్నప్పుడు ఎదు రొడ్డి పోరాడే ముందు సర్వశక్తులనూ ఏకం చేసు కుని సమాయత్తమయ్యే ఆవేశం అది.

టీవీ ఆఫ్ చేసి వాడిని దగ్గరకు తీసుకు న్నాను. ఆ మాత్రం స్పర్శకే వాడు కరిగిపో యాడు. కండ్ల నిండా నీళ్లు నింపుకొని 'నాన్నా... తెలంగాణ వస్తదంటవా...!' అడిగాడు.

"తప్పక వస్తదిరా... అదిప్పుడు ప్రజా పోరాటమైంది. ఎవలు అడ్డంబడ్డా ఆగది" నమ్మకంగా చెప్పాను..

పలవరిస్తూ నా గుండె మీదనే నిద్ర పోయాడు. చివరి క్షణంలో ఇలాంటి చేతి స్పర్శనే ఉంటే ఈ పిల్లల చావులు సగానికి సగం తగ్గేవనిపించింది. మరునాటి నుండి టీవీ చూడగూడదని హెచ్చరించాను.

అదంతా నాకిప్పుడు గుర్తుకచ్చింది.

'సరే... నువ్వేం భయపడకు. వాడెక్కడ నో ఫ్రెండ్ వద్ద ఉంటడు. నేను దేవులా డకస్త!' అంటూ బయటకు వచ్చాను. ఎటు వెళ్లాలో తోచడం లేదు. ఎక్కడ వెదకాలో తెలియడం లేదు. ఇంట్లో ఆపుకున్న దుఃఖం ఇప్పుడు వణుకుగా మారింది.

బయట చీమల పుట్ట కదిలినట్టు జనం. ఎల్.ఐ.సీ. ఆఫీసు నుండి కోర్టు వరకు రోడ్డుమీదనే వంటా వార్పు. ఇంట్లో వెల గాల్సిన పొయ్యి రోడ్డు మీద మండుతుంది. జనం రోడ్డు మీదనే భోజనానికి కూర్చు న్నారు. లాయర్లు కోర్టు ఆవరణలో హడావు డిగా తిరుగుతున్నారు.

'ఇన్నేండ్ల చరిత్రలో తెలంగాణ నుంచి ఒక్క అడ్వకేట్ జనరల్ లేడు... ఇదేమిటం టే నమ్మకమున్న వ్యక్తి కావాలంటరు. తెలంగాణ లాయర్లు అంత నమ్మకద్రోహు లా...' ఒక లాయర్ మరో లాయర్‌తో ఆవే శంగా అంటున్నాడు.

వాళ్లను దాటుకుని కాలేజీ ముందుకు వచ్చాను. కొందరు యువకులు రోడ్డు మీ ద, మోకాళ్లపైన నడుస్తూ నిరసన తెలిపితే మరోవైపు కొంతమంది వెనుకకు నడుస్తూ నిరసన తెలుపుతున్నారు. ఈ జనంలోనే ఎక్కడనో ఒకచోట పవన్ ఉండి ఉంటాడని

నా ఆశ. ఒకటి రెండుసార్లు వాడిని దీక్షా శిబిరం దగ్గర చూసాను. 'మీ కొడుకు జోర్ దార్ మాట్లాడుతడు... తెలంగాణను ఎట్ల దోసుకున్నరో చెప్పుతుంటే రోమాలు నిల వడ్డయనుకో..." అని మిత్రులు కూడా అన్నారు. ఆశగా ఉద్యోగ సంఘాల జే.ఏ.సి. దీక్షా శిబిరం వైపు నడిచాను.

శిబిరంలో ఉద్యోగులు దండలు వేసుకుని కూర్చున్నారు. ఎవరో విద్యార్థి 'ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా వీర తెలంగాణమా' పాట పాడుతున్నాడు. పవన్ కోసం నా కండ్లు శిబిరాన్నంతా వెదికాయి. పవన్ కనిపించలేదు.

"సార్... ఎటో వచ్చిండ్రు. ఈ రోజు దీక్షల గూసుంటరా" మాటలు వినిపించి పక్కకు చూస్తే తెలిసిన మిత్రుడు. నేను నవ్వుతూ చూసాను. "610 జివో వచ్చింది సార్. కాని అమలైందా... అమలైతే మన పిల్లలకు నౌకర్లు రావా..." అని ఇంకేదో చెప్తున్నాడు. నేను అవేవీ వినడం లేదు. అంబేద్కర్ బొమ్మ దగ్గర మానవహారం కనిపించింది. ఎవరో యువకుడు ఆవేశంగా మాట్లాడుతున్నాడు. పవన్‌లా అనిపించి అటువైపు నడిచాను.

ఎక్కడి వాహనాలు అక్కడే ఆగి ఉన్నాయి. బొమ్మ చుట్టూ మానవహారం. ముందు స్కూల్ పిల్లలు వెనుక వరసులో యువకులు. అరుపులు నినాదాలు. దీక్ష బూనిన సైనికుల్లా ఉన్నారు.

'ఈ జనం ఎక్కడి నుంచి వస్తున్నరు...? ఎందుకు వస్తున్నరు...? ఇంత ఆవేశాన్ని ఇన్ని రోజులు ఎక్కడ దాచుకున్నరు? ఇది నిన్న మొన్న కలిగిన ఆకాంక్షనా లేక ఏండ్ల కేండ్లు మనసులో గూడు కట్టుకున్న కోరికనా...? ఆలోచిస్తూ మనిషిని మనిషిని పట్టి చూసాను. పవన్‌లా చాలామంది కనిపించారు. కాని పవన్ కనిపించలేదు.

నా మనసు ఆక్రోశిస్తుంది. ఆ జనమంతా దేని కోసం తపిస్తూ ముందుకు వెళ్తున్నారో అంతకు వెయ్యి రెట్లుగా పవన్ కోసం నా తపన పెరిగింది. జనంలోంచి దూరంగా వచ్చి గవర్నమెంటు హాస్పిటల్ ముందు ఆగాను. గాంధీరోడ్ నుంచి మరో ఊరేగింపు వస్తుంది. ఎక్కడ వెదకాలో తోచక పాండుకు ఫోను చేసాను.



'ఎవలకు వాల్లే ఇట్ల అనుకుంటే ఎట్ల వస్తది. తెలంగాణ రాకపోవడానికి ఇదొక్కడే కారణం. ప్రజలందరిలో ఈ భావన ఉన్నా అది ఏకకాలంలో వ్యక్తం కాకపోవడమే... అదే అలుసుగా నాయకులు డ్రామా ఆడుతుండ్రు' పవన్ చాలా లోతుగా మాట్లాడుతున్నాడు.

"నేనే ఫోన్ చేద్దామనుకుంటున్న. ఇంట్లో పవన్ ఉన్నడా...?" అడిగాడు పాండు.

పాండు అడిగిన తీరు నన్ను కలవరపెడుతున్నా "లేదురా...అందుకే ఫోన్ చేసిన..." అన్నాను.

'ఒరే ఫూల్... వాన్ని ఇంట్లోంచి ఎందుకు పోనిచ్చినవురా... ఎప్పుడు వెళ్లిండు' అన్నాడు కంగారుగా.

నా గొంతు భయంతో ఎండుకపోయింది. ఆతృతగా 'ఎందుకురా' అన్నాను.

"రాజీనామాలు ఉపసంహరించుకున్నందుకు నిరసనగా ఓయు జె.ఏ.సి. బంద్‌కు పిలుపు ఇచ్చిందిరా. వరంగల్‌లో ఒకరు సిద్దిపేటలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నరు. యూనివర్సిటీలు యుద్ధభూములైనయిరా...' పాండు ఇంకేదో చెబుతున్నాడు.

ర్యాలీ దగ్గర కావడంతో అరుపులకు మాటలు వినిపించడం లేదు. అయినా వాడి గొంతులోని హెచ్చరిక మాత్రం అర్థమయింది. అటు మానవహారం. ఇటు ఊరేగింపు. ఆ జనాన్ని, జనంలోని ఉత్తేజాన్ని చూస్తుంటే పాండు హెచ్చరిక నాలో భయాన్ని కలిగించలేదు.

"లేదు... నా కొడుకు అంత పిరికోడు కాదు... నేను అట్ల పెంచలేదు. ఈ జనంలో వాడు ఎక్కడో ఖచ్చితంగా పిడికిలెత్తి ముందే ఉంటడు. ఉద్యమాల గడ్డ మీద పుట్టినోడు. ఉస్మానియాలో చదివినోడు. ఏ ఊరేగింపుకో దారి చూపిస్తూ ఉంటడు" అనుకున్న కాని ధైర్యం చాలలేదు. గుండెలో దడ పుట్టింది.

అప్పటికి ఊరేగింపు నా దగ్గరికచ్చింది. వెనక్కి చూస్తే మానవహారంతో చౌరస్తా విచ్చుకున్న గులాబీలా ఉంది. ముందుకు చూస్తే ప్రవాహంలా కదులుతున్న జనం. 'కోమటోళ్ల కొట్లాట' అని జనం మధ్యలో పెద్ద బ్యానర్. అందరి మొహాల్లో ఏదో టెన్షన్. అంతకు మించి ఏదో పట్టుదల. అందుకునేంత దూరంలోనే శత్రువు ఉంటే రగిలే పగతో కదం తొక్కుతూ కదులుతున్నట్టు అందరిలో ఏదో ఆవేశం.

"అసోయ్‌దులా ఆరతి... కాళ్ల గజ్జెల గమ్మతి. తెలంగాణ లడాయికి పెరుగుతున్న ఇమ్మతి" పాట పాడుతూ ఆలువ ఆడుతున్నారు.


నీరసంగా ముందుకు నడుస్తూ టైం చూసుకున్నాను. పన్నెండు దాటింది. ఎటు వెళ్లాలా అని ఆలోచిస్తు ంటే ఆర్డీవో ఆఫీసు ముందున్న ఇంకో శిబిరం గుర్తుకొచ్చింది. నెల రోజులుగా దీక్షలు సాగుతున్నాయి అక్కడ.

బెయిల్ మీద ఇంటికి వచ్చినరోజే 'నాన్నా... మీరు దీక్షల్లో కూర్చున్నరా...' అడిగాడు పవన్.

'దీక్షల్లో కూర్చుంటే తెలంగాణ వస్తదా...?' అడిగాను.

'ఎవలకు వాల్లే ఇట్ల అనుకుంటే ఎట్ల వస్తది. తెలంగాణ రాకపోవడానికి ఇదొక్కడే కారణం. ప్రజలందరిలో ఈ భావన ఉన్నా అది ఏకకాలంలో వ్యక్తం కాకపోవడమే... అదే అలుసుగా నాయకులు డ్రామా ఆడుతుండ్రు' పవన్ చాలా లోతుగా మాట్లాడుతున్నాడు.

అసెంబ్లీ ముట్టడి కేసులో అరెస్టయ్యాడు పవన్. రిమాండ్‌లో పవన్‌ను కలిసేవరకు నేను వాడిని ఆ స్థాయిలో ఊహించుకోలేదు. విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి వ్యూహారచన వీడిదేనంటే ఇప్పటికే నేను నమ్మలేకపోతున్నాను. తన పుస్తకాలు తన చదువు తప్ప బయట కూడా తిరగనివాడు వీడేనా అనిపిస్తుంది.



'చదువురాని జనమంతా స్పష్టంగా ఉన్నరు. ఈ నాయకులే నాన్నా... కన్ఫ్యూజ్ క్రియేట్ చేస్తున్నరు. అది తట్టుకోలేకనే విద్యార్థులు చస్తున్నరు" తీవ్రంగా అన్నాడు పవన్.

నేను వాడి ఆలోచనలను మార్చాలని ఉద్యమం గురించి ఉదాసీనంగా మాట్లాడితే నన్నే వ్యతిరేకిలా చూస్తున్నాడు. నన్ను వాడు వ్యతిరేకించకుండా వాడి ఆలోచనలో మార్పు వచ్చే అతి సున్నితమైన మాటల కోసం ఆనాటి నుంచి నేను వెతుక్కుంటూనే ఉన్నాను. శ్రీకాంత్, వేణుగోపాల్, యాదయ్యల మరణాలను వాడు ఉద్యమ మైలురాళ్లుగా చూస్తున్నాడు. ఆత్మహత్య పోరాటపు పరాకాష్టగా చూస్తున్నాడు. భయం గొలిపే మరో విషయం ఏమిటంటే వీడు రిమాండ్‌లో ఉండగా మిలాఖత్‌లో కలవడానికి వచ్చిన చాలామంది విద్యార్థులు ఇదే భావనతో కనిపించారు. ఆత్మహత్యను త్యాగమే అనుకుంటున్నారు.

అక్కడ వీడు రిలేదీక్షల్లో గాని కూర్చున్నాడా అన్న చిన్న ఆశ నన్ను శిబిరం వైపు నడిపింది. ఎదురుగా వస్తున్న జనాన్ని దాటి వెళ్లడం కుదరదని మున్సిపల్ ఆఫీసు పక్కసందులోకి తిరిగాను. అక్కడి నుంచి మార్కెట్ చేరుకుంటే పక్క సందులోంచి తిన్నగా ఆర్డీవో ఆఫీసు చేరుకోవచ్చు.

నడుస్తుంటె ఓ మిత్రుడు కలిసి విష్ చేసాడు. యాంత్రికంగా చెయ్యి ఊపాను. ఎదురుగా వచ్చి "సార్ అప్పుడట్ల జేసిరి. ఇప్పుడిట్ల జేయవట్టిరి. ఇన్నేండ్లయింది. మన సిరిసిల్ల తాలూకాల ఒక్క డిగ్రీ కాలేజ్ ఉందా. అక్కడయితే మండలానికోటి. మరి మన పిల్లలకు సదువే వద్దా... అందుకే సార్. మనది మనకు గావాలె" ఏదేదో అంటున్నాడు. నేను వినిపించుకోకుండా ముందుకు నడిచాను.

మున్సిపల్ ఆఫీసు దాటానో లేదో స్కూలు పిల్లల ర్యాలీఎదురయింది. ముందు అమ్మాయిలు వెనక అబ్బాయిలు. జంటలు జంటలుగా వస్తున్నారు. పిల్లలు నోటికి నల్లబట్ట కట్టుకున్నారు.

ఫ్రీజోన్ కాదురా -హైదరాబాద్ మాదిరా.

కదిలిందిర తెలంగాణ - ఖబడ్దార్ ఖబడ్దార్

పిల్లల చేతుల్లో ప్లే కార్డులు. లైను ఎక్కడివరకు ఉందో తెలియదు. పుట్టల్లోంచి చీమల్లా సందులోంచి పిల్లలు వస్తూనే ఉన్నారు. నాలుగు అడుగులు ముందుకు




నడిచి లేబర్ అడ్డావైపు చూసాను. అక్కడంతా ఖాళీగా ఉంది. పొద్దు దాటిపోయినా ఇంకా ఆశగా చూసే కూలీలు లేరు. పొద్దు దాటిందనే నెపంతో సగం కూలీకే బేరాలు కుదుర్చుకునే గుత్తదార్లు లేరు. కూలీలను విసుక్కుంటున్న దుకాణదార్లు లేరు. అక్కడ అడుగు ముద్రలు తప్ప జనం లేరు.

'వీళ్లంతా ఏమయ్యిండ్రు. ఎక్కడికెళ్లిండ్రు' అనుమానం వచ్చింది.

పక్క సందులోకి తిరిగి మార్కెట్‌వైపు నడిచాను. ఎవరో నడివయసు వ్యక్తి. అడ్డామీది కూలీ కావచ్చు. సైకిల్‌కు తెల్లజండా కట్టుకున్నాడు. క్యారిల్‌కు సద్దిడబ్బా, గడ్డపార ఉన్నది. 'వాడెవ్వడు... వీడెవ్వడు. తెలంగాణ కడ్డెవ్వడు. మా బతుకును దోచినోడ. చరిత్రను దాచినోడ. తెలంగాణ కడ్డొస్తే అడ్డంగా నరుకుతాం' పాడుకుంటూ ఆవేశంగా సైకిల్‌పై వస్తున్నాడు.

> **అతడు ఆవేశంతో ఉన్నాడో ఆకాంక్షతో రగిలిపోతున్నాడో ఆలోచిస్తూ మార్కెట్‌లోకి వచ్చాను. ఎప్పుడూ గిజగిజలాడే మార్కెట్ ఖాళీగా కనిపించింది. అప్పటికి పక్క ఊర్ల నుంచి వచ్చినవాళ్లు వెళ్లిపోయే హడావుడిలో ఉండాలి. వాళ్ల తొందరను గమనించి మారు బేరకాళ్లు బేరమాడుతూ ఉండాలి. ఇప్పుడు అదేదీ లేదు.**

క్షణం ఆగి అతడివైపు చూసాను. తన సమస్త బాధలకు కారణం ఏమిటో తెలిసినట్టు దానిని ప్రశ్నించడానికే వెళ్తున్నట్టు అతడు వేగంగా వస్తున్నాడు. నేను హఠాత్తుగా ఆగడంతో తొట్రు పడి బ్రేకులు వేసాడు. అయినా అది ఆగలేదు. కొద్దిలో నన్ను ఢీకొట్టేదే. చివరి క్షణంలో నేను పక్కకు తప్పుకున్నాను. అతడు తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు. అదే ఆవేశంతో నా వైపు చూసి కుడి చేతి పిడికిలి పైకెత్తి 'జై తెలంగాణ' అంటూ వెళ్లిపోయాడు.

అతడు ఆవేశంతో ఉన్నాడో ఆకాంక్షతో రగిలిపోతున్నాడో ఆలోచిస్తూ మార్కెట్‌లోకి వచ్చాను. ఎప్పుడూ గిజగిజలాడే మార్కెట్ ఖాళీగా కనిపించింది. అప్పటికి పక్క ఊర్ల నుంచి వచ్చినవాళ్లు వెళ్లిపోయే హడావుడిలో ఉండాలి. వాళ్ల తొందరను గమనించి మారు బేరకాళ్లు బేరమాడుతూ ఉండాలి. ఇప్పుడు అదేదీ లేదు. ఎత్తివేసిన సైనికుల గుడారంలా ఉంది మార్కెట్. అంబులెన్స్ ఒకటి సైరన్ ఊదుతూ వేగంగా పోతుంది. కుల్లిపోయిన కూరగాయల కోసం పందులు కొట్లాడుకుంటున్నాయి. మార్కెట్ కాంప్లెక్స్‌లో అక్కడక్కడా ఒకరిద్దరు అమ్మకందార్లు తీరిగ్గా కూర్చున్నారు.

'మనిషి బతుకాలంటే నీళ్లు గావాలె గదా... చెరువుల నీళ్లుంటే బొంబాయి, దుబాయి ఎందుకు బతుకవోతరు. ఇన్ని వానలు కొట్టినయి. వరదలు పారినయి. మన మానేరు ఒక్కసారి నిండిందా... మనకు నీళ్లు గావాలె... మన నీళ్లు మనకు గావాలె' నెత్తి మీద కూరగాయల గంపతో ఒక వ్యక్తి వెళ్తూ అంటున్నాడు.

ఇంకో వ్యక్తి సైకిల్‌పై పాలక్యాన్‌తో ఉన్నాడు. 'తల్లికిద్దరు కొడుకులుంటే ఇద్దరిని సమానంగ జూడాలె. వడ్ల గొలుకలు నాకు కొయ్యకాలు నీకు అంటే ఎట్ల. గవుర్మెంటు కొనే పాలల్ల చెరుకు కట్టెల గూడా తేడానే నట. అక్కడొక రేటట. ఇక్కడొక రేటట. మన పాలు నల్లగుంటయా, మన శెక్కరి చేదుగుంటదా' అన్నాడు.

"కరెంటునే సూడరాదు... పుట్టేదిక్కడ ఎలిగేదక్కడ..." మొదటి వ్యక్తి.

తెలిసింది కొంత తెలియనిది కొంత మాట్లాడుకుంట వెళ్తున్నారు. వాళ్లను దాటేసి ముందుకు నడిచాను. సందులోంచి బ్యాంక్ ఎదురుగా రోడ్డు ఎక్కాను. అక్కడా జనమే. ఎన్నడూ ఏ కోరిక కోసం రోడ్లెక్కని కాటి కాపర్లు. బోలుగంట ఊపుకుంటూ పోతున్నారు. 'నాయకుల్లారా చస్తే మీ కట్టెను కూడా కాల్చం-మీ శవాన్ని పూడ్చం' అనే పెద్ద బ్యానర్ పట్టుకున్నారు.

నాకు చిన్నగా తలనొప్పి మొదలయింది. జనాన్ని తప్పించుకుని సెస్ ఆఫీసు ముందుకు చేరుకున్నాను. అక్కడ కూడా జనం గుంపు గూడి ఉన్నారు. తెలిసిన వ్యక్తి ఒకరు ఆవేదనతో నా దగ్గరికచ్చాడు.

"సార్! ఎంత అన్యాయం ఇన్నేండ్ల సమైక్య రాష్ట్రంలో ఒక్కనాడన్న మన పండుగల గురించి ఒక్క సినిమా తీసిండ్రా... మన పోరాట యోధుల గురించి చరిత్ర రాసిండ్రా..." అన్నాడు.


నేను వినిపించుకోకుండా ముందుకు నడిచాను. మందిని తప్పుకుంటూ దీక్షా శిబిరం వద్దకు నడిచాను. అక్కడ కూడా జనం సముద్రంలాగే ఉన్నారు. లోకల్ నాయకుడొకరు ఆవేశంగా 'ఇప్పుడు కాకుంటే ఇగ ఎప్పుడూ రాదు. చావో రేవో తేల్చుకోవలసిందే. డిసెంబర్ తొమ్మిదినాడు చిదంబరం తెలంగాణ ప్రకటన చేసిండు. దాన్ని ఆంధ్ర నాయకులు రాజీనామాలు చేసి అడ్డుకున్నరు.వాళ్ల లెక్క మన నాయకులు రాజీనామా చేస్తే రాష్ట్రం వచ్చేదే. వీళ్లు వెనక్కి తగ్గి రాష్ట్రం రాకుంట చేసింద్రు. పిల్లల శవాల మీద ఒట్టు పెట్టుకొని రాజీనామా చేస్తమన్నరు.కాదు సల్లారకముందే మాట తప్పింద్రు.. మీసాలు దిద్దుకుంట ఢిల్లీకి పోయిన పెద్దలు ఆంధ్రోళ్లకు అమ్ముడు పోయింద్రు. ఆనాడు చెన్నరెడ్డి గిట్లనే జేసిండు" మాట్లాడుతున్నాడు.

ఉద్వేగాన్ని చప్పట్లుగా మార్చుకోవడం తెలిసినవాడు.మాటలతో చప్పట్లను మూట గట్టుకున్నాడు. వింటుంటే మనసును మెలిపెట్టినంత బాధ. ఉపన్యాసం తర్వాత పాట. ఆత్మహత్య చేసుకున్నవారిని వీరులుగా కీర్తించేది. ఆ తర్వాత ఇంకో నాయకుడు మైకును అందుకున్నాడు. యువత పోరాడాలని త్యాగాలకు వెనుకాడకూడదని ఉద్యమించాలని ఆవేశంగా ప్రసంగించాడు. ప్రాణాలైనా అర్పిస్తాం. తెలంగాణ సాధిస్తాం' అంటూ ముగించాడు. వాళ్ల మాటలను, పాటలను వింటున్న యువకులను చూస్తే భయమేసింది.

మనిషి మనిషిని పట్టి చూస్తున్నాను. పవన్ మాత్రం కనిపించడం లేదు.

ఎక్కడి నుండి చూసాడో... పాండు పరుగెత్తుకుని వచ్చాడు. నన్ను ఏదో ఓదార్చాలని ధైర్యం చెప్పాలని వచ్చినట్టున్నాడు. అతడు ఊహించిన స్థితిలో నేను లేకపోవడంతో సందిగ్ధంలో పడ్డాడు. తన ప్రయత్నంగా 'వాడు ఎక్కడికి పోడురా... ఇక్కడే ఎక్కడో ఉంటడు. రూరల్ దీక్షా శిబిరం దగ్గర మొన్న పాట పాడుతుంటే చూసిన. అక్కడ గాని ఉన్నడేమోనని చూసివస్తున్న' అన్నాడు.

ముందుకు నడుస్తున్నా ఇద్దరం పవన్ కోసమే వెదుకుతున్నాం. ఆరాటంగా ఇద్దరి చూపులు ఎక్కడెక్కడో వెదికి ఒక్క చోటుకు వచ్చి ఆగిపోతున్నాయి. ఒకరికొకరం చూపులతో దొరికిపోతున్నాం.



నేను మౌనంగా వాడి భుజం మీద చేయి వేసాను.పాండు ఆవేదనగా నా వైపు చూస్తూ 'ఈ మాటలు పాటలేరా... జనాన్ని ఆగం జేస్తున్నది. ఉద్యమానికి ప్రాణమిచ్చినవాడు వీరుడు. ఉద్యమంలో ప్రాణం తీసుకున్నోడు వీరుడెట్లయితడు. వాళ్ల ఆత్మహత్యలను ఫోకస్ చేస్తే మరిన్ని జరగవా. ఉద్యమాన్ని ఓట్ల రాజకీయం చేసినన్ని రోజులు ఇట్లనే ఉంటదిరా...!' అన్నాడు.

'కారణం టీవీలో, మాటలో, పాడే పాటలో కాదురా... ఉద్యమాలు పోరాటాలు ఈ తరం వాళ్లకు కొత్త. ఒకప్పుడైతే సామాజిక ఉద్యమాలన్నీ కాలేజీల్లోనే పురుడు పోసుకునేవి. వామపక్ష ఉద్యమాలు కాలేజి పిల్లలకు స్ఫూర్తిని, ధైర్యాన్ని, నమ్మకాన్ని, పోరాట పటిమను ఇచ్చేవి. ఇప్పుడు కెరీర్ పేరుతో మనం, శాంతి భద్రతల పేరుతో ప్రభుత్వం పిల్లల్ని ఉద్యమాలకు దూరం చేసి పుస్తకాల పురుగుల్ని చేసినము. అదే తట్టుకోలేకపోతున్నారు' అన్నాను.

పవన్ కనిపించడం లేదన్న ఆతృత నాలో ఉన్నా దాన్ని కనిపించనీయడం లేదు. మందిలోంచి ఇద్దరం బయటకు వచ్చాం.

'ఉద్యమం నాయకుల చేతుల నుంచి ప్రజల చేతులకు పోయింది. అన్ని వర్గాల ప్రజలు ముందుకచ్చింద్రు. వాళ్లకు ఏం నష్టం జరిగిందో తెలిసిపోయింది. స్వాతంత్ర్య పోరాటం తర్వాత అదే పట్టుదలతో ప్రజలు చేస్తున్న ఉద్యమంరా ఇది' నడుస్తూ అన్నాను.

అంటుండగానే సెల్ మోగింది. స్వప్ననే. ఏం చెప్పాలో తెలియక ఫోన్ ఎత్తలేదు.

ముందుకు నడుస్తున్నా ఇద్దరం పవన్ కోసమే వెదుకుతున్నాం. ఆరాటంగా ఇద్దరి చూపులు ఎక్కడెక్కడో వెదికి ఒక్క చోటుకు వచ్చి ఆగిపోతున్నాయి. ఒకరికొకరం చూపులతో దొరికిపోతున్నాం. సమయం గడుస్తున్నకొద్ది నాలో ధైర్యం సన్నగిల్లుతుంది. అడుగులు తడబడుతున్నాయి. పాండు వైపు బేలగా చూస్తూ 'ఎక్కడికి పోదాంరా... యాడ జూద్దాం. జాడెట్ల దొరకాలె' అన్నాను.

'ఒరేయ్... వాడెక్కడున్నడో దేవులాడాలెరా... నాకేదో భయంగా ఉంది. రెండు మూడుసార్లు నాతో వాడు పిచ్చిపిచ్చిగా మాట్లాడిండు... రిమాండ్‌లో ఉన్నప్పుడు వాడేమన్నడో గుర్తుంది గదా' అన్నాడు.

నాకు తలనొప్పి మరీ ఎక్కువయింది. లోలోపల భయంగా ఉన్నా పైకి పాండుకు ధైర్యం చెప్తుతూ 'వాడు అంత పిరికోడు కాదురా... ఈ జన ప్రవాహంలో ఎక్కడో యుద్ధనాదమై మోగుతుంటడు' అన్నాను.

నా మాటల్ని విని పాండు ధైర్యం తెచ్చుకున్నాడు గాని నాకే ధైర్యం అడుగంటింది.

గాంధీ ఆస్పత్రికి వచ్చి టాబ్లెట్ కొనుక్కుందామని చూసాను. ఎమర్జెన్సీ సర్వీసు కింద ఎప్పుడూ తెరిచే ఉండే మందుల షాపులు కూడా మూసి ఉన్నాయి. కనీసం టీ అయినా దొరుకుతుందని రెండు మూడు చోట్ల చూసాను. 'తెలంగాణకు మద్దతుగా నేడు రేపు బంద్' అన్న బోర్డులు దర్శనమిచ్చాయి.

ఇద్దరం పెద్ద బజారు వైపు వస్తుంటే స్కూలు పిల్లలు రోడ్డు మీదే పరీక్ష రాస్తున్నారు. ఎప్పుడూ సైకిళ్లతో జనంతో నిండుగా హడావుడిగా ఉండే విమల టాకీస్ గేట్లు మూసుకొని బోసిపోయినట్టుంది. సినిమా పోస్టర్ మీద పెండ గుర్తులున్నాయి. ముందుకు వచ్చి పోస్టాఫీసు సందులోకి చూస్తే పండ్ల బండ్ల ర్యాలీ సాగుతుంది. వెంకటేశ్వర టెంపుల్ సందులో బతుకమ్మ ఆట. హనుమాన్ గుడి ముందు సాకిరేవు. 'నాయకుల్లారా...ఊరికి వస్తే మీ బట్టలు ఉతుకం' అన్న బ్యానర్.

జనం నిరసన చూస్తుంటే ఉత్తేజంతో నా వెతుకులాటనే మరిచిపోయాను. "ఈ జనానికి ఇంత ఉత్తేజం ఎట్ల వచ్చిందిరా.ఇది సెంటిమెంట్ అంటవా.." అడిగాడు పాండు.

'సెంటిమెంటయితే ఒక వ్యక్తిలో ఉంటది. ఒక రోజుంటది. ఒక తరానికుంటది. కాని ఇట్ల వ్యక్తి నుంచి వ్యక్తికి తరం నుంచి తరంకు ఏండ్లకేండ్లు ఉండది. ఇది బలమైన ఆకాంక్షరా...! నీళ్లకోసమో, నిధుల కోసమో, ఉద్యోగాల కోసమో చేసే పోరాటం కాదురా. తెలంగాణ అస్తిత్వం కోసం చేసే పోరాటం. అందుకే సబ్బండ వర్ణాలు పనిపాటలను ఇడిసిపెట్టి రోడ్లమీదికచ్చినయి సూడు. ఊరూరు యుద్ధనాదమై మోగుతంది..." అంటుండగా పాండు "ఒరేయ్ ఒరేయ్..." అంటూ ముందున్న గుంపు వైపు చూపించాడు.

నేను భయంగా ముందుకు చూసాను. గుంపులోంచి ఒక్కసారిగా మంటలు లేచాయి. ఎవరిదో దిష్టిబొమ్మ పేరు రాసిన ప్లేకార్డు సగం కాలి అక్షరాలు పోల్చుకోకుండా ఉన్నాయి. చుట్టూ మూగిన జనం కళ్లల్లో ఎర్రని మంటలు ప్రతిబింబిస్తున్నాయి. వాళ్ల చూపులుకూడా ఎరుపెక్కి ఉన్నాయి. అందులో పవన్ ఉన్నాడు. కాలుతున్న బొమ్మను కసిగా చూస్తూ "సమైక్యాంధ్ర వద్దురా... తెలంగాణ ముద్దురా" అని పిడికిలెత్తి నినాదాలు చేస్తున్నాడు."ప్రాంతంవారు ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వెడుతం" బొమ్మను కాళ్ళతో కసిగా తంతున్నాడు.